క్లుప్తంగా

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



ముండ్లపాడు (పెనుగంచిప్రోలు): గ్రామంలో వేంచేసి యున్న శ్రీవిఘ్నేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో అర్చకులు పరాంకుశం సీతా రామాచార్యులు ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. మూడురోజులుగా నిర్వహిస్తున్న హరేరామ నామ సంకీర్తన సప్తాహ మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా పశువైద్యశాల



మక్కపేట(వత్సవాయి): గ్రామంలోని పశువైద్యశాల అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. భీమవరం రహదారిలో నివాసప్రాంతాలకు దూరంగా ఉండటంతో రాత్రి సమయంలో దీన్ని ఆసరాగా చేసుకుని మందుబాబులు అక్కడే చిందులు వేస్తున్నారు. మద్యం తాగి అక్కడే సీసాలను పడవేసి వైద్యశాలను బహిర్భూమిగా మారుస్తున్నారు. మందుబాబుల తాకిడి రహదారిపై ప్రయాణిస్తున్న వాహనదారులే భయపడుతున్నారు. వైద్యశాలకు చుట్టూ ప్రహారీ, గేటు లేకపోవడంతో రాత్రి సమయాల్లో మందుబాబులకు ఈ ప్రాంగణం అడ్డాగా మారిపోయింది. రాత్రిళ్లు ఇష్టారీతిన పడవేసిన మద్యంబాటిళ్లను తెల్లవారి సిబ్బంది తొలగించుకుంటున్నారు. ఈ విషయంపై ఎస్‌ఐ పి ఉమామహేశ్వరరావును వివరణ కోరగా రాత్రి సమయంలో పోలీసులతో గస్తీ ఏర్పాటు చేసి, మందుబాబుల చర్యలకు అడ్డుకట్ట వేస్తామని వివరించారు.

అన్నదానానికి విరాళాలు



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి బుధవారం భద్రాచలం పట్టణానికి చెందిన చల్లగుళ్ల నితిన్‌సాయి, శ్రావణి దంపతులు రూ.10వేలు విరాళంగా అందజేశారు. ఈ మేరకు ఆలయ అధికారుల చేతుల మీదుగా నగదు అందజేశారు. హైదరాబాద్, ఈసీఐఎల్ ప్రాంతానికి చెందిన పండనబోయిన తిరమలయ్య రూ.10,116లు అన్నదానానికి విరాళం అందజేశారు. ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

భూ రీసర్వే పరిశీలన



తక్కెళ్లపాడు(జగ్గయ్యపేట): గ్రామంలో నిర్వహిస్తున్న భూరీసర్వేను అసిస్టెంట్ కలెక్టర్ శుభమ్ నోఖ్వాల్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూరీసర్వేను నిష్పక్షపాతంగా పూర్తిచేయాలని, రైతులతో ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. సర్వేయర్‌తో మాట్లాడి సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఆర్డీఓ కె.బాలకృష్ణ, ఇన్‌చార్జి తహసీల్దార్ మనోహర్, ఎన్నికల డీటీ రాధిక, వీఆర్వో హుసేన్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులు



వీరులపాడు: మహారాష్ట్రలోని నాసిక్‌లో ఇటీవల జరిగిన నేషనల్ గేమ్స్ జంప్ రోప్ క్రీడల్లో తమ విద్యార్థులు వెండి, రజత పతకాలను సాధించారని ఏకత్వ పాఠశాల చైర్మన్ అమరనేని రమేష్ బాబు తెలిపారు. పతకాలను సాధించిన విద్యార్థులు కొండూరు సన్నీ, షేక్ అయేషాసిద్ధికాతోపాటు వారి తల్లిదండ్రులను బుధవారం పాఠశాలలో అభినందించారు. వ్యాయామోపాధ్యాయుడు గోగులమూడి విజయ్‌కుమార్, మనోజ్, సింధూర, సూర్యావతి పాల్గొన్నారు.

ఫీల్డ్‌అసిస్టెంట్ సస్పెన్షన్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుకు సంబంధించి విధినిర్వహణలో అలసత్వం వహించిన వీరులపాడు మండలం గూడెం మాధవరం ఫీల్డ్ అసిస్టెంట్ (ఎఫ్‌ఏ) మన్నే సుధీర్ సస్పెన్షన్‌కు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ బుధవారం ఆదేశాలిచ్చారు. గ్రామంలో వేతనదారులకు పనులు కల్పించడంలోనూ సగటు వేతనం విషయంలో జిల్లాలోనే అట్టడుగు స్థానంలో నిలిచినట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విధులకు, సమావేశాలకు హాజరుకానందున క్రమశిక్షణా చర్యల్లో భాగంగా సస్పెన్షన్ ఆదేశాలిచ్చారు. ఈవిషయమై సుధీర్‌కు నోటీసులు జారీ చేశారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలో హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. పాతపేట గడ్డ వద్ద నిర్వహించిన జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, మాజీమంత్రి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం, మాజీ ప్రభుత్వ విప్, జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, హిందూ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పిన్నం వెంగళరావు, పాల్గొనిశివాజీ చిత్రపటానికి నివాళులర్పించారు. ధైర్యానికి, దేశభక్తికి ధీరత్వానికి మారుపేరుగా నిలిచిన శివాజీ మహారాజ్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం ఛత్రపతి శివాజీ మహారాజ్ చిత్రపటంతో ఏర్పాటుచేసిన రథంతో పట్టణంలో ప్రధాన వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని గాయత్రీ ఆశ్రమ వ్యవస్థాపకులు, తాత్వికులు చిట్టా లక్ష్మీనరసింహ శాస్త్రి జెండాఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కీసర రాంబాబు, మన్నె శ్రీనివాసరావు, నోముల రఘు, శివాజీ మహారాజ్ విగ్రహం ఏర్పాటు కోర్‌కమిటీ ప్రతినిధులు పబ్బతి నరేంద్ర, సంకా భాస్కర్, తూములూరి అశోక్‌లు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, ఆర్‌ఎస్‌ఎస్, విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు పాల్గొన్నారు.



శివాజీ విగ్రహ ఏర్పాటు కోసం భూమిపూజ చేస్తున్న లక్ష్మీనరసింహశాస్త్రి తదితరులు

విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

జగ్గయ్యపేట పట్టణంలో హిందూ చైతన్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ చేశారు.

గాయత్రీ ఆశ్రమ వ్యవస్థాపకులు చిట్టా లక్ష్మీనరసింహశాస్త్రి, బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు వామనశర్మ, తిరుమలగిరి దేవస్థాన ప్రధాన అర్చకులు తిరునగరి రామకృష్ణమాచార్యులు, వేదపండితులు భరద్వాజ్‌శర్మ, సాయిశర్మ, మహేష్‌శర్మ, శ్రావణ్‌శర్మ పూజలు నిర్వహించారు. శివాజీ విగ్రహ ఏర్పాటు కోర్ కమిటీ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, మాజీమంత్రి నెట్టెం రఘురాం తదితరులు

నందిగామలో..

నందిగామటౌన్(నందిగామరూరల్): పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ తొర్లికొండ సీతారామయ్య మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ ధీరత్వాన్ని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరావు, కామేశ్వరరావు, కేదార్‌నాద్ శర్మ, కృష్ణ, లక్ష్మణ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నీటి తరలింపును అరికట్టాలని డిమాండ్



తూముల ద్వారా అక్రమంగా తరలిస్తున్న నీరు

నవాబుపేట(పెనుగంచిప్రోలు): గ్రామంలోని రామన్న పంట చెరువు నుంచి కొందరు గుర్తుతెలియని వ్యక్తులు తూముల ద్వారా నీటిని ఖాళీ చేస్తున్నారని సర్పంచ్ జి.మేరి, ఎంపీటీసీ సభ్యురాలు, శాంతకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చెరువు ఆయకట్టు కింద ఎటువంటి పంటలు వేయకపోయినా అక్రమంగా గ్రావెల్‌ను తోలుకోవాలనే ఉద్దేశంతో చెరువు నీటిసంఘం ద్వారా తీర్మానం చేసి పంటు వేశారన్నారు. చెరువులోని నీటిని తూముల ద్వారా, గండికొట్టి నీటిని తరలిస్తున్నారన్నారన్నారు. ఈ విషయంపై ఇప్పటికే హైకోర్టును ఆశ్రయించగా, అక్రమంగా పెట్టిన గండిని పూడ్చి, తూముల ద్వారా జరుగుతున్న నీటిసరఫరాను నిలుపుదల చేయాలని గౌరవ న్యాయస్థానం తీర్పు ఇచ్చిందన్నారు. హైకోర్టు ఉత్తర్వులను పంచాయతీ, రెవెన్యూ శాఖల అధికారులు అమలుచేయడం లేదన్నారు. ఈ విషయంపై కలెక్టర్, ఆర్డీఓ, ఇతర ఉన్నతాధికారులుకు వినతి పత్రాలు ఇచ్చామన్నారు. గతంలో చెరువులో నీరులేక నవాబుపేటతో పాటు పక్కనే ఉన్న తోటచర్ల గ్రామ ప్రజలు తాగు నీటికి అనేక ఇబ్బందులు పడ్డారన్నారు.

నీటి అక్రమ తరలింపు కారణంగా అదే పరిస్థితి తలెత్తుందని వారు ఆందోళన వ్యక్తంచేశారు. ఇకనైనా అధికారులు స్పందించి నీటి అక్రమ తరలింపును అడ్డుకోవాలని వారు డిమాండ్ చేశారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



కంచికచర్ల: పరీక్షల సమయంలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేయడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతోపాటు, మండలంలోని గండేపల్లి, గనిఆత్కూరు, పెండ్యాల, గొట్టుముక్కల, పరిటాల, మోగులూరు గ్రామాల జిల్లా పరిషత్ పాఠశాలల విద్యార్థులకు సాక్షి యాజమాన్యం అందజేసిన స్టడీ మెటీరియల్స్‌ను బుధవారం పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని కంచికచర్ల, వీరులపాడు, నందిగామ, చందర్లపాడు మండలాల్లోని జిల్లా పరిషత్ పాఠశాలలకు స్టడీ మెటీయల్స్ అందజేశామని సాక్షి ప్రతినిధులు తెలిపారు.

పైపులైన్ లీకేజీ సరిచేయండి సారూ!

కన్నెవీడు(వత్సవాయి): రక్షిత మంచినీరు వృథాగా పోతున్న పంచాయతీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇందుగపల్లి రక్షిత మంచి నీటి పథకం నుంచి ఇందుగపల్లితోపాటు కన్నెవీడు గ్రామానికి కూడా మంచినీరు సరఫరా చేసే పైపులైన్‌కు కన్నెవీడు–ఇందుగపల్లి గ్రామాల మధ్యలో పైపులైన్ పగిలిపోయి నీరంతావృథాగా పోతోంది. అంతేకాకుండా వృథాగా పోయిన నీరంతా అక్కడే నిల్వ ఉండి కలుషితంగా మారి మరలా పైపుల ద్వారా మంచినీళ్లలో కలిసిపోతుండటంతో మంచినీరు కాస్తా మురుగుగా మారుతోందని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదని విమర్శిస్తున్నారు. ఇకనైనా పంచాయతీ అధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.



రహదారి పక్కన కలుషితంగా మారిన మంచినీరు

మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ 'రామిశెట్టి' మృతి

బూదవాడ(జగ్గయ్యపేట): మండలంలోని బూదవాడకు చెందిన మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ రామిశెట్టి ఆదినారాయణ(75) బుధవారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు, మండల కన్వీనర్ బూడిద నరసింహారావు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదినారాయణ కుటుంబసభ్యులను పరామర్శించి వారికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

రైతులకు విశిష్ట సంఖ్య తప్పనిసరి



కంచికచర్లలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ డాక్టర్ కె.శ్రీనివాస్

కంచికచర్ల: రైతులు ఈనెల 25వ తేదీ లోగా విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలని నందిగామ ఏడీఏ డాక్టర్ ఐకే శ్రీనివాస్ సూచించారు. మండలంలోని పరిటాల, కంచికచర్ల రైతు సేవా కేంద్రాల్లో బుధవారం పంట నమోదు ఆవశ్యకత, సబ్సిడీలో అందుబాటులో ఉన్న కిసాన్ డ్రోన్స్‌పై రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ప్రతి రైతు విశిష్ట సంఖ్యను కలిగి ఉండాలని, లేనిపక్షంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీతో ఇచ్చే యంత్ర పరికరాలు మంజూరుకావన్నారు. పంట ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోళ్లు చేయాలంటే తప్పనిసరిగా రైతులకు విశిష్ట సంఖ్య ఉండాలన్నారు. రైతులు ఏఏ పంటలు సాగుచేశారో ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు. అనంతరం బిందు సేద్యం, స్ప్రింకర్ల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.విజయకుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు చంద్రశేఖర్, హనేష్, రైతులు పాల్గొన్నారు.

పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలి



చందర్లపాడు(నందిగామరూరల్): అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ డీడీ మోజెస్ వెస్లీ సూచించారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకంలో భాగంగా పశుగణాభివృద్ధి సంస్థ సౌజన్యంతో బుధవారం చందర్లపాడు మండలం ఏటూరులో పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు వచ్చే వ్యాధులపై పోషకులు అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం 50 పశువులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో శ్రీనివాసు, సర్పంచ్ వెంకటేశ్వరరావు, పశువైద్యాధికారులు వెంగళరావు, శ్రీకాంత్, ప్రదీప్ చంద్ర, సుమంత్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

బీసీ బాలికల వసతిగృహాన్ని సందర్శించిన డెప్యూటీ కలెక్టర్

వార్డెన్‌పై విద్యార్థినుల ఫిర్యాదు

మైలవరం: మైలవరం పట్టణంలోని బీసీ బాలికల వసతి గృహాన్ని డెప్యూటీ కలెక్టర్ మహేష్ (జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి) బుధవారం సందర్శించారు. వసతి గృహంలో సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వార్డెన్ సక్రమంగా విధులకు హాజరు కావడంలేదని విద్యార్థులు ఫిర్యాదు చేశారు. వసతి గృహంలో భోజనాలు కూడా అంతంత మాత్రంగానే ఉంటున్నాయని బాలికలు ఆవేదన వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం గత రెండేళ్లలో ఎప్పుడూ భోజనం తయారు చేయలేదన్నారు. కాగా డెప్యూటీ కలెక్టర్ సందర్శనకు వచ్చినప్పటికీ సదరు వార్డెన్ వసతి గృహానికి రాకపోవడం గమనార్హం. డెప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ లిఖిత పూర్వకంగా నివేదిక రాసుకుని, తదుపరి కలెక్టర్‌కు పంపుతామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. వార్డెన్ రమాదేవి అందుబాటులోకి రానందున ప్రస్తుతం బీసీ బాలుర వసతిగృహం వార్డెన్ నరసింహారావుకు బాధ్యతలు అప్పగించారు.

పార్టీ పటిష్టతకు కృషిచేస్తా

నందిగామటౌన్(నందిగామ రూరల్): కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువస్తామని ఆలిండియా కాంగ్రెస్ పార్టీ ప్రొఫెషనల్స్ విభాగం రాష్ట్ర చైర్మన్ వల్లూరు భార్గవ్ పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు బొర్రా కిరణ్‌తో కలిసి బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశానికి కాంగ్రెస్ పార్టీ ఆవశ్యకత ఉందన్నారు. రాష్ట్రంలో పర్యటించి పార్టీ బలోపేతానికి కృషి చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు నరహరశెట్టి నరసింహారావు, గురునాధం, మంద వజ్రయ్య, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

చెరకు లారీ బోల్తా

ఇబ్రహీంపట్నం: నందిగామ నుంచి ఉయ్యూరు చెరకు ఫ్యాక్టరీకి చెరకు లోడుతో వెళుతున్న లారీ బుధవారం తెల్లవారు జామున పశ్చిమ ఇబ్రహీంపట్నం వద్ద అదుపు తప్పి బోల్తా కొట్టింది. రోడ్డుపై చెరకు లోడు పడిపోవడంతో భారీగా ట్రాఫిక్ నిలిచింది. ఘటనా స్థలానికి చేరుకున్న ట్రాఫిక్ ఎస్‌ఐ బి. లక్ష్మణరావు కూలీలను రప్పించి రోడ్డుపై పడిన చెరకును వేరే లారీలోకి లోడింగ్ చేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



సంసోను కుటుంబానికి న్యాయం చేయాలి



మైలవరం: చట్టాన్ని రక్షించాల్సిన పోలీసులే ఆ చట్టాన్ని ఉల్లంఘించి అమాయకులపై థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తున్నారని కుల వివక్ష పోరాట సమితి(కేవీపీఎస్) జిల్లా అధ్యక్షుడు గుండిమెడ క్రాంతికుమార్ అన్నారు. ఇటీవల మైలవరం మండలం మొర్సుమల్లి శివారు ములకలపెంటలో జరిగిన ఒక హత్యకు సంబంధించి విచారణ పేరుతో మొర్సుమల్లి గ్రామానికి చెందిన దళిత యువకుడు వడ్లపూడి సంసోనుపై పోలీసులు థర్డ్ డిగ్రీ ఉపయోగించడంతో బాధితుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అస్వస్థతకు గురైన సంసోను, అతని కుటుంబాన్ని బుధవారం మొర్సుమల్లి గ్రామానికి వెళ్లి కేవీపీఎస్, ప్రజా సంఘాల నాయకులు పరామర్శించారు. నాయకులు మాట్లాడుతూ పోలీసులు కుల వివక్ష చూపిస్తున్నారని ఆరోపించారు. నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన పోలీసులు అగ్రకులాల వారిని ఒక రకంగా చూస్తూ దళితులను మరో రకంగా చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. చివరకు ఈ హత్య కేసులో మృతుని సొంత కమారుడే హత్య చేశాడని పోలీసులు అతనిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారన్నారు. ఎలాంటి ఆధారాలు లేకపోయినా సంసోనును తీసుకువచ్చి చిత్రహింసలు పెట్టడం తగదని, సంబంధిత అధికారులుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎం. కుటుంబరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కల్యాణ్, సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు మంద వెంకటేశ్వరరావు, కోట డానియేల్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు



బయోఇన్‌పుట్‌పై అవగాహన కల్పిస్తున్న కోఆర్డినేటర్ అచ్యుతరాజు

గరికపాడు(జగ్గయ్యపేట): షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళికలో భాగంగా గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రంల(కేవీకే)లో మూడు రోజులుగా ఎస్సీ రైతులకు ప్రకృతి వ్యవసాయంపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. ఈసందర్భంగా కేవీకే కోఆర్డినేటర్ అచ్యుతరాజు మాట్లాడుతూ మహిళా రైతులు పెరటి కూరల పెంపకం, పాడి పరిశ్రమ లాభదాయకంగా ఉంటుందన్నారు. గా సేంద్రియ ఎరువులపై కూడా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. . అనంతరం బయోఇన్‌పుట్‌ల తయారీని క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించి, సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శివప్రసాద్, రాజశేఖర్, వెంకటరెడ్డి, జశ్వంత్‌రెడ్డి, ప్రభావతి, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ నందిగామకు సహకరించాలి: కమిషనర్

నందిగామటౌన్(నందిగామ రూరల్): పట్టణంలోని చిరు వ్యాపారులు స్వచ్ఛ నందిగామకు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ రమణబాబు సూచించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కొబ్బరిబోండాలు, పూల దుకాణాలు, అరటి పండ్లు తదితర వ్యాపారులు నిర్వహించుకునే చిరు వ్యాపారులతో బుధవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరు వ్యాపారులు వారి దుకాణాలలోని వ్యర్థాలు, చెత్తాచెదారాలను చెత్త కుండీలలో వేయాలన్నారు. లేనిపక్షంలో చెత్త సేకరణ సిబ్బందికి అందించాలని సూచించారు. చెత్త సేకరణ యూజర్ చార్జీలను ప్రతి నెలా ముందుగా చెల్లించి రశీదు పొందాలని కోరారు. ఏఈ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



చిరువ్యాపారులతో సమావేశం నిర్వహిస్తున్న కమిషనర్ రమణబాబు

రేపటి నుంచి సిలువగిరి మహోత్సవాలు

పల్లగిరి(నందిగామ రూరల్): పరిశుద్ధ సిలువగిరి పుణ్యక్షేత్ర మహోత్సవాలకు మండలంలోని పల్లగిరి గట్టుపై ఉన్న సిలువగిరి ముస్తాబవుతోంది. ఈనెల 21వతేదీ నుంచి మూడు రోజుల పాటు జరగనున్న సిలువగిరి మహోత్సవాలకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. ప్రాంగణమంతా విద్యుద్దీపాలతో అలంకరిస్తున్నారు. కొండపైకి వెళ్లే మార్గంలో ఏసు జన్మవృత్తాంతాన్ని తెలిపే విగ్రహాలకు, కొండ దిగువను ఉన్న మేరీమాత విగ్రహానికి రంగులు వేసి ముస్తాబు చేస్తున్నారు. ప్రార్థనలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేక వేదికను ఏర్పాటు చేశారు.ఈ ఏడాది కూడా పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారనే అంచనాతో అందుకనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పుణ్యక్షేత్ర రెక్టార్, విచారణకర్త ఎం. ఫిలోమెన్ రాజు తెలిపారు. క్రీస్తు సువార్త స్వస్థతా ప్రార్థనలు, తదితర ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. గట్టుపై ఉన్న చర్చి వద్ద భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన వివరించారు.



ముస్తాబవుతున్న సిలువగిరి

21నుంచి మహోత్సవాలు..

ఈనెల 21న క్రీస్తు సువార్త ప్రార్థనలు, సమిష్టి దివ్యబలిపూజ, చిన్నారులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఫిలోమెన్ రాజు తెలిపారు. 22నక్రీస్తు సువార్త ప్రార్థనలు, సమిష్టి దివ్యబలిపూజ, నృత్య ప్రదర్శనలు, కోలాటం, నాటక ప్రదర్శన, 23న జపమాల, సమిష్టి దివ్య బలిపూజ, దావీదు విజయం బైబిల్ పౌరాణిక నాటకం ఉంటాయని వివరించారు. 23న విజయవాడ పీఠాధిపతి డాక్టర్ తెలగతోటి జోసఫ్ రాజారావు పాల్గొని క్రీస్తు సందేశం వినిపిస్తారని ఆయన తెలిపారు.

సీసీ కెమెరాల హార్డ్ డిస్క్ అపహరణ

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని విష్ణుప్రియనగర్‌లో ఇంట్లో ఎవరూ లేని సమయంలో రెక్కీ నిర్వహించి మంగళవారం అర్ధరాత్రి చోరీ చేశారు. సీసీ కెమెరా హార్డ్ డిస్క్ ఎత్తుకెళ్లారు.

వివరాల్లోకి వెళితే..విష్ణుప్రియనగర్‌కు చెందిన ఇంటి యజమాని చింతపల్లి వెంకటప్రసాద్ కుంభమేళాకు వెళ్లగా మంగళవారం అర్ధరాత్రి సమయంలో సీసీ కెమెరాలు కట్ అయినట్లు ఆయన సెల్‌ఫోన్‌కు సమాచారం అందింది. దీంతో ఆయన ఇంటిపక్క వారికి సమాచారం అందించగా, వారు వెంకటప్రసాద్ ఇంట్లో చోరీ జరిగినట్లు నిర్ధారించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు

సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

అగంతకుడు సీసీ కెమెరాల వైర్లు కత్తిరించడంతో పాటు కెమెరాల దిక్కును మార్చాడు. ఇంటిలోని వైఫై సీసీ కెమెరా, ఎన్‌వీఆర్ సిస్టంను పట్టుకుపోయినట్లు పోలీసులు గుర్తించారు. విజయవాడ నుంచి వచ్చిన క్లూస్ టీం టెక్నికల్ వివరాలను సేకరించారు. నేరపరిశోధన విభాగం డీసీపీ వెంకటేశ్వర్లు, నందిగామ ఏసీపీ తిలక్ వచ్చి చోరీ జరిగిన తీరును పరిశీలించారు. త్వరలో దొంగను పట్టుకుంటామని ఏసీపీ తిలక్ తెలిపారు. సీఐ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో ఎస్‌ఐలు జి.రాజు, వెంకటేశ్వరరావు విచారణ చేపట్టారు. సంఘటనాస్థలాన్ని పరిశీలించిన వారిలో పోలీస్ టీం సభ్యులు జాలయ్య, లక్ష్మీనారాయణ, భాను 8న్నారు.



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఏసీపీ తిలక్, సీఐ వెంకటేశ్వర్లు తదితరులు

ఆప్కాస్ రద్దు నిర్ణయం తగదు

జగ్గయ్యపేటఅర్బన్: ఆప్కాస్ రద్దు నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ఏఐటీయూసీ నాయకులు బుధవారం జగ్గయ్యపేట మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావును కలిసి వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల వేతనాల చెల్లింపులు, పనుల నిర్వహణ బాధ్యత స్థానిక మున్సిపల్‌శాఖకే ఉండాలని, ప్రైవేటు సంస్థలకు అప్పగించరాదని ప్రభుత్వాన్ని కోరారు. అవుట్ సోర్సింగ్, పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ విభాగంలోని కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసినవారిలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శివాజీ, పట్టణ కార్యదర్శి జె.శ్రీనివాసరావు, ఏఐటీయూసీ జిల్లా నాయకులు పోతిపాక వెంకటేశ్వర్లు, మున్సిపల్ కార్మిక నాయకులు వాసు, భాస్కరరావు, విజయ్‌కుమార్, శాంతకుమారి, జ్యోతి తదితరులు ఉన్నారు.



కమిషనర్ రామ్మోహనరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు

బూడిద అక్రమ రవాణాపై ఆగ్రహం

అడ్డుకున్న స్థానికులు

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ ట్రక్ టెర్మినల్ బూడిద చెరువులో బూడిద అక్రమ రవాణాపై స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేశారు. పాత బూడిద చెరువులో బూడిద లోడింగ్ చేస్తున్న పొక్లెయిన్లు, లారీలను అడ్డుకుని ఆందోళనకు దిగారు. పలువురు మాట్లాడుతూ ఎన్టీటీపీఎస్ అధికారులు నిషేధిత ప్రాంతంగా ప్రకటించిన పాత బూడిద చెరువులో యథేచ్ఛగా బూడిద లోడింగ్ జరపడంతో ఇళ్లపై బూడిద పడుతోందన్నారు. గతంలో మూసివేసిన చెరువులో తిరిగి తవ్వకాలు జరపడం ఏమిటని ప్రశ్నించారు. చెరువు మూసివేసి గ్రావెల్ తోలి ప్లాంటేషన్ చేపట్టారన్నారు. చెరువును తిరిగి రీ ఓపెన్ చేయడం, ప్లాంటేషన్ గుల్ల చేయడం ఏమిటని విమర్శించారు. వార్డు కౌన్సిలర్ రావి ఫణి మాట్లాడుతూ బూడిద అక్రమ రవాణాపై ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ నాగరాజును వివరణ కోరినా ఇప్పటి వరకు స్పందించలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. బూడిద పైపులను కావాలని లీకేజీలు చేసి పైపుల ద్వారా వచ్చిన బూడిదను గుట్టుచప్పుడు కాకుండా లారీల ద్వారా తరలిస్తున్నారని ఆరోపించారు. బూడిద అక్రమ రవాణాపై స్థానికుల ఆందోళన తెలుసుకున్న తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు, ఎన్టీటీపీఎస్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. అక్రమ రవాణాదారులపై స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. స్థానికులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



బూడిద లోడింగ్ చేస్తున్న పొక్లెయిన్‌ను అడ్డుకున్న స్థానికులు